నేడు కవాడిగూడలో పద్మారావుగౌడ్ పాదయాత్ర

కవాడిగూడ, ఏప్రిల్ 21: కవాడిగూడ డివిజన్ కొత్తబజార్ మెయిన్ రోడ్డులో గల హనుమాన్ దేవాలయం నుంచి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచార పాదయాత్ర సోమవారం ప్రారంభమవుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న సాయంత్రం 4.30 గంటలకు హనుమాన్ టెంపుల్‌లో పూజలు నిర్వహించిన అనంతరం కవాడిగూడ డివిజన్‌లోని కొత్తబజార్, మసీద్ లైన్, ముగ్గుబస్తీ, సింగాడికుంట, ఉన్నికోట, చిత్రాల్‌నగర్, భవానీనగర్, బండమైసమ్మనగర్, దోమలగూడలో పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ పాదయాత్రలో నియోజక వర్గంలోని ఆరు డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, బూత్ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

జీవీఆర్ కరాటే అకాడమీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కాచిగూడ, ఏప్రిల్ 21 : కరాటేలో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించబోతున్నామని కాచిగూడ జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ జీఎస్. గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కరాటే అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న జీవీఆర్ అకాడమీలో కరాటేలో 24 కిక్‌లతో 24 సెకండ్లలో 24 నాపరాళ్లను తమ అకాడమీ విద్యార్థులు బద్దలు కొట్టి వరల్డ్ రికార్డ్‌ను సృష్టించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమీర్, ధీరన్‌రానా, అకాడమీ శిక్షకులు నర్సింగ్ రావు, శ్యామ్, కుమార్, అమృతరెడ్డి, మహేందర్, జాకీర్ పాల్గొన్నారు.

కష్టపడే వారినే బూత్ కన్వీనర్లుగా నియమించాలి

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, ఏప్రిల్ 21: పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేసేవారినే పోలింగ్‌బూత్ కన్వీనర్లుగా నియమించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో డివిజన్‌కు సంబంధించిన 51 పోలింగ్ బూత్‌ల కన్వీనర్ల జాబితాను ఎమ్మెల్యేకు ఆయన కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడే నాయకులమంటూ ముందుకు వచ్చే నేతలను పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడే వారికే బూత్ కన్వీనర్లు పార్టీ పదవులను అప్పగిస్తామని పేర్కొన్నారు. నియోజక వర్గంలో ఆరు డివిజన్ల అధ్యక్షులు ప్రతి బస్తీ కాలనీ నుంచి పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించి పోలింగ్ జాబితా తయారు చేయాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇష్టానుసారంగా జాబితాలో పేర్లు రాస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని అన్నారు. పద్మారావు గెలుపుతో బీఆర్ఎస్ బలమైన శక్తిగా మారుతుందని అప్పుడే పార్లమెంట్ పరిధిలోని నియోజక వర్గాలు అభివృద్ధికి నిధులు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, ఉపాధ్యక్షుడు ఎ. శంకర్ గౌడ్, మైనారిటీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బూత్ కన్వీనర్ల జాబితాను ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు అందజేస్తున్న పార్టీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

మెహిదీపట్నం, ఏప్రిల్ 21 : ప్రజలకు మంచి పాలనను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఈ విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లి లోక్‌సభ ఎన్నికలలో హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించడానికి కృషి చేయాలని బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం కార్వాన్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజలను మోసం చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోడూరి శ్రీధర్ సాగర్, ముత్యాల భాస్కర్ పాల్గొన్నారు.

లోక్‌సభ స్థానాల బూత్‌లెవల్ కోఆర్డినేటర్‌గా గౌరి సతీశ్

ఆబిడ్స్ ఏప్రిల్ 21 : లోక్‌సభ ఎన్నికలలో మెదక్, జహీరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ బూత్‌లెవల్ కో-ఆర్డినేటర్‌గా గౌరి సతీశ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వార్‌రూమ్ కో-ఆర్డినేటర్ పవన్ మల్లాడి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ.. మూడు పార్లమెంట్ స్థానాల పరిధిలోని బూత్‌లెవల్‌లో సిబ్బందికి శిక్షణ ఇచ్చి, పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని అన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం మహావీర్‌జయంతిని జైన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో జైన్ సేవాసంఘ్ అధ్యక్షుడు యోగేశ్ సింఘీ, మైనార్టీ కమిషన్ సభ్యులు హిమాన్షుబాప్నా, అశోక్ జైన్, సురేశ్‌సురానా, కైలాష్ బండారి, సుభాష్ జైన్ తదితరులు పాల్గొన్నారు. – ఆబిడ్స్

పూసల కులస్తుల సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న పూసల సంఘం చైర్మన్ కోల శ్రీనివాస్

రవీంద్రభారతి, ఏప్రిల్ 21: పూసల కులస్తుల సమస్యలను పరిష్కరించాలని ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంచార జాతులుగా కొనసాగుతున్న పూసల కులస్తులను ఎంబీసీ జాబితాలో చేర్చాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు మధుయాస్కీగౌడ్ గతంలో నిర్వహించిన తమ ధర్నా కార్యక్రమానికి విచ్చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పూసల కులస్తులను ఎంబీసీ జాబితాలో చేర్చే విధంగా కృషి చేస్తామని మాట ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందున పూసల కులస్తులను ఎంబీసీ జాబితాలో చేర్చాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. సీఎం సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

హనుమాన్ జయంతి బైక్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

భజరంగ్ సేన కార్యాయంలో హనుమాన్ జయంతి ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కాచిగూడ, ఏప్రిల్ 21 : హనుమాన్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం కాచిగూడ భజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో ఈనెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 10 గంటలకు హనుమాన్ వ్యాయామశాల నుంచి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. భజరంగ్ సేన ప్రతినిధులు సునీల్ అగార్వాల్, మనోజ్, అభియాన్, రవి, రామేశ్వర్, వీరేందర్ పాల్గొన్నారు.

కందుకూరి వీరేశలింగం పంతులుకు నివాళి

వీరేశలింగం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పించిన కోలేటి దామోదర్‌గుప్తా, తదితరులు

ముషీరాబాద్, ఏప్రి ల్ 21: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొ రేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని వీరేశలింగం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాటి మూఢ నమ్మకాల సమాజాన్ని ఎదిరించి సామాజిక సంస్కరణలకు బీజం వేసిన మహనీయుడు కందుకూరి వీరేశలింగం అని కొనియాడారు.

గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పొత్తూరి సుబ్బారావు, సత్యనారాయణమూర్తి, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ఫలితాల్లో అత్యధిక ర్యాంకులు సాధించిన రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ

580 పి ర్యాంక్ సాధించిన నాగ భరత్ ను అభినందిస్తున్న రామ్, డా. వివేకానంద

ఇటీవల ప్రకటించిన యూపీఎస్సీ 2023 ఫలితాల్లో అత్యధికంగా 24 ఆల్ ఇండియా ర్యాంకులు (03, 27, 59, 104, 148, 155, 169, 173, 217, 467, 526, 554, 580, 590, 639, 703, 711, 739, 818, 830, 891, 914, 938, 985) హైదరాబాద్ అశోక్ నగర్ లోని రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ సాధించిందని డైరెక్టర్స్ డా. గడియారం వివేకానంద, శ్రీ రామ్ ముప్పాళ్ళ, శ్రీ సి ఎల్ ఎన్ ధనంజి తెలిపారు. స్థాపించిన మూడు సంవత్సరాలలో 45 (2022 లో 15 ర్యాంకులు, 2021లో 6 ర్యాంకులు, నేడు ప్రకటించిన 2023 ఫలితాల్లో 24) ర్యాంకులు సాధించిన రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ 2030 నాటికి 100 మంది ఐఏఎస్ మరియు 100 మంది ఐపీఎస్ లను దేశానికి అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా ఈ ఫలితాల సరళి ఉండటం ఆనందకరమైన సందర్భమని వారు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకొరకు ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్ (జనరల్ స్టడీస్) కోసం 'ఐఏఎస్ సూపర్ 90' కోర్సును నిర్వహిస్తుంది. దీనిలో కేవలం 90 మందికి మాత్రమే ప్రవేశం. కోర్సు ఇంగ్లీష్ మాధ్యమంలో ఆఫ్లైన్/ ఆన్లైన్ లో లభ్యమవుతుంది. జూన్ 2, 2024 నుంచి బేసిక్ తరగతులు ప్రారంభం అవుతాయి. యూజి/ పిజి పూర్తిచేసుకున్న అభ్యర్థులు, వారు 10th, ఇంటర్, గ్రాడ్యుయేషన్ లో సాధించిన మార్కులు ఆధారంగా తక్కువ ఫీజుతో ప్రవేశం పొందుతారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 9866079891 లో సంప్రదించగలరు.

బలమైన బోధనతో ప్రసంగిస్తున్న డా. వివేకానంద

ADVERTISEMENT

అవార్డు ప్రదానం..

చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో సేవ శ్రేష్ఠ అవార్డును జర్నలిస్టు నవతకు ప్రదానం చేస్తున్న యమున పాఠక్ తదితరులు – చిక్కడపల్లి

ఈవీఎంలపై అవగాహన..

గోల్నాక, ఏప్రిల్ 21: వచ్చే నెల 13న నిర్వహించే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అంబర్‌పేట సర్కిల్ కార్యాలయంలో ఆదివారం అధికారులు వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. ఈవీఎంల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్ పనితీరు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు రామ్మోహన్‌రావు, షేక్‌అబ్దుల్లా, అర్షద్, మహ్మద్ బాబా, షేక్ మహ్మద్ అలీ, నవీద్, కెంచె చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

గోషామహల్‌లో బీజేపీ అభ్యర్థి మాధవీలత ప్రచారం

బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత ఆదివారం గోషామహల్ నియోజకవర్గంలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లాల్ సింగ్ లోధా, బోయిని దర్శన్, నాయకులు కమల్ సింగ్, నట్‌రాజ్ నాంధారి, సంజయ్ ఘనాటె, గోపాల్‌జీ, సోమ్‌రాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. – ఆబిడ్స్, ఏప్రిల్ 21

పల్లకీ సేవలో భక్తులు..

మహావీర్ జయంతి వేడుకలు ఆదివారం కాచిగూడ లింగంపల్లి జైన్ మందిర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహావీర్ పల్లకీ సేవా ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – కాచిగూడ, ఏప్రిల్ 21

గోల్కొండలో ఇద్దరు బాలురు అదృశ్యం

అదృశ్యమైన బిలాల్, రహీం

మెహిదీపట్నం ఏప్రిల్ 21 : మదర్సాలో చదువుకోవడానికి వచ్చిన ఇద్దరు బాలలు అదృశ్యమైన ఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ సాలెనగర్ కంచలో ఉన్న జమీయా మదర్సాలో మల్లేపల్లికి చెందిన మహ్మద్ బిలాల్(10), మహ్మద్ రహీం(8)లు ఖురాన్‌ను అభ్యసిస్తున్నారు. వీరిద్దరూ ఈనెల 19న మదర్సా నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

మరో ఘటనలో..

జుబేర్ బిన్ ఒమర్ అల్కామన్

మెహిదీపట్నం ఏప్రిల్ 21 : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ రిసాల బజార్‌లో నివసించే జుబేర్ బిన్ ఒమర్ అల్కామన్(51) శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

సీసీ నగర్‌లో మహిళ..

యాదమ్మ(ఫైల్)

కవాడిగూడ, ఏప్రిల్ 21: పనికి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ డి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పీఎస్ పరిధిలోని సీసీ నగర్‌కు చెందిన యాదమ్మ(44) ఈ నెల 12న పనికి వెళ్లి తిరిగి రాలేదు. భర్త దేవయ్య, బంధువులు అంతటా వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో దేవయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పద్మారావుగౌడ్‌ను గెలిపించండి..

● బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ

సమావేశంలో మాట్లాడుతున్న ముఠా జయసింహ

కవాడిగూడ, ఏప్రిల్ 21: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. ఆదివారం రాత్రి ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పార్టీ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా జయసింహ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించి బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చేలా ప్రతి బస్తీ, కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని అన్నారు. డివిజన్‌లోని 51 పోలింగ్ బూత్‌ల పరిధిలో సమావేశాలు నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీకి ప్రజలను మరింత చేరువ చేయాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో షరీఫ్, రహీం, పార్టీ సీనియర్ నాయకుడు రెబ్బ రామారావు, షఖీల్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్ ముదిరాజ్, మున్వర్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ కాంట్రాక్ట్ వర్కర్స్‌కు 30వేల వేతనం ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్

చిక్కడపల్లి, ఏప్రిల్ 21: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ కనీస వేతనం రూ.30వేలకు పెంచాలని ఆల్‌ఇండియా ఎస్‌బీఐ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్‌బీఐలో కాంట్రాక్ట్ వర్కర్స్‌తో 12 గంటల వెట్టి చాకిరి చేయించుకుంటూ వేతనం కేవలం రూ.15,000 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రలో ఎస్‌బీఐ కాంట్రాక్ట్ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 7వేల మంది కాంట్రాక్ట్ వర్కర్స్ ఉన్నారని, 8 గంటలకు మించి పనిచేస్తే అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు యాజమాన్యం వర్కర్స్‌కు 30 రోజుల వేతనం ఇస్తుండగా కాంట్రాక్టర్స్ మాత్రం 26రోజులకే చెల్లిస్తూ 4 రోజుల వేతనాన్ని జేబులో వేసుకుంటూ వర్కర్స్ పొట్టకొడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి పాండు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం ఎన్నికల ప్రచారం

మెహిదీపట్నం, ఏప్రిల్ 21: కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకి డివిజన్లలో ఎంఐఎం హైదరాబాద్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తరపున కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్,నాయకులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో..

ఆబిడ్స్ : ఎంఐఎం హైదరాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని దారుస్సలాం, పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఎమ్మెల్సీ రహమత్ అలీబేగ్ ఖాద్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నగర చరిత్ర, వారసత్వంపై ఎన్నో ఏళ్లుగా కృషి

సుల్తాన్‌బజార్ క్లాక్ టవర్ వద్ద హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 21: నగర చరిత్ర, వారసత్వంపై ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నామని, ప్రస్తుతం గుప్త సంపదలను కనుగొనడం అభినందనీయమని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సహకారంతో వాయిస్ ఆఫ్ హెరిటేజ్ బ్యాడ్జ్ ప్రోగ్రామ్-2024లో భాగంగా ఐసీఓఎంఓఎస్ ఇండియా హెరిటేజ్ వాక్‌ని నిర్వహించారు. ఈ వాక్‌ను కోఠిలోని హస్మత్‌గంజ్ గేట్, క్లాక్ టవర్, రెసిడెన్సీ సర్జన్స్ బంగ్లా, బ్యాంక్ స్ట్రీట్, ట్రూప్‌బజార్‌లోని పామర్స్ సమాధి, నిర్లక్ష్య స్థితిలో ఉన్న పాతలక్ష్మీనారాయణ ఆలయం, నివాసగోడ చరిత్రతో పాటు బ్రిటిష్‌తో అనుబంధించబడిన అసురక్షిత వారసత్వ నిర్మాణాలను ఉదాహరణలుగా చూపుతూ యంగ్ డైనమిక్ కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్ బిందుభార్గవి 50మంది భాగస్వామ్యంతో ఈ వాక్‌ను నిర్వహించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ఈ వాక్‌లో జేఎన్ఏఎఫ్ఏయూ విద్యార్థినులు శ్వేత, వైష్ణవిలు రూపొందించిన శీఘ్ర స్కెచ్‌లను ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వీఓహెచ్ వర్కింగ్ బ్యాడ్జ్ 2024ని పంపిణీ చేశారు. ఐసీఓఎంఎస్ సౌత్ జోన్ ప్రతినిధి ప్రొఫెసర్ ఎస్‌వీ సూర్యనారాయణమూర్తి, ఇందిరా కొల్లి, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కలవరాలు, శిశిర సుమాలు పుస్తకాల ఆవిష్కరణ

రచయిత్రి నాగలక్ష్మి రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవి కె. శివారెడ్డి

తెలుగు యూనివర్సిటీ,ఏప్రిల్ 21 : రచయిత్రి నాగలక్ష్మి రచించిన కవిత్వం మొదటి నుంచి చివరిదాకా చదివేలా పుస్తకాలను రచించడం అభినందనీయమని ప్రముఖ కవి కె.శివారెడ్డి అన్నారు. ఆదివారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో రచయిత్రి వారణాసి నాగలక్ష్మి రచించిన జంట పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను తన కుమారునికి, కుమార్తెకు అంకితం ఇవ్వడం విశేషం. కార్యక్రమంలో కవయిత్రి కొండపల్లి నీహారిణి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ అమృతలత, రచయిత్రి నెల్లుట్ల రమాదేవి పాల్గొన్నారు.

శోభాయాత్రకు భారీ బందోబస్తు : సీఐ

చిక్కడపల్లి, ఏప్రిల్ 21: హనుమాన్ జయంతి సందర్భంగా 23న నిర్వహించే శోభాయాత్రకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య చెప్పారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో 500 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నారాయణగూడ నుంచి అశోక్‌నగర్ వరకు భారీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ రమేశ్ శోభాయాత్రరూట్‌ను ఇప్పటికే పరిశీలించారని, శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

నేడు ప్లేస్‌మెంట్ డ్రైవ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 21 : సొసైటీ ఫర్‌రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) ఆధ్వర్యంలో ఫ్రీ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం రామ్‌నగర్ ఎక్స్‌రోడ్స్ సమీపంలోని మణపురం గోల్డ్‌లోన్ భవనం మూడవ అంతస్తులోని ఎస్ఆర్‌డీ సెంటర్‌లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ వరకు చదువుకున్న యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 90524 85742కు సంప్రదించండి.